ఆడది అబల కాదు!

"రండి! మంచి ఛాన్స్! తాజా సరుకు, ముప్పయి పైసలమ్మా మూర, పావలాయే!....కొప్పులో పెట్టుకుంటే కోసెడు దూరం గుప్‌మనాలి!....రండమ్మా రండి.... మల్లెపూలమ్మా, మూర పావలాయే!" అంటూ కీచు గొంతుకతో గట్టిగా అరుస్తూ బస్‌స్టాండులో వినిపించే తక్కిన శబ్దాలన్నింటినీ మింగేస్తూ, హడావిడి చేస్తున్న గౌరికేసి చూసింది శైలజ.

బస్‌స్టాండుకి ఎదురుగా రోడ్డు అవతల చిన్న కర్ర మండిగ మీద మల్లె పూవులు గుట్టలుగా పోసి, వాటితో మధ్యమధ్య మరువం కనకాంబరాలు వేసి మాలగా కడుతూ, అప్పుడప్పుడు జారిపోతూన్న జానెడు జుట్టూ వేలికి చుట్టి జారుముడి వేసుకుంటూ అరుస్తూంది గౌరి. పట్టుమని చూస్తే పదహారేళ్ళు లేవు. కొద్దిగా పొట్టిగా సీలమండల మీదకి ఎగదోసుకుపోయిన మాసిన పరికిణీ, అతుకు వేసిన వోణీ, మట్టిగొట్టుకుపోయిన చెంపలూ, ఎండుగడ్డిలా గాలికి ఎగురుతూ రేగిపోయిన జుట్టు-ముఖం చామన ఛాయగా నీరసంగా వెల్లివిరుస్తూన్న చురుకుదనం-వీటివల్ల ఒకరకమయిన ఆకర్షణే కనిపిస్తూంది గౌరిలో.

చేత్తో బ్రీఫ్ కేస్ పట్టుకుని రాబోయే బస్‌కోసం ఎదురు చూస్తున్న శైలజ చెవుల్లో వచ్చిపోతూన్న బస్సుల చప్పుళ్లూ, హారన్లూ, రకరకాల సరుకులమ్మే వాళ్ళ అరుపులూ ప్రయాణీకుల కబుర్లూ, ముష్టివాళ్ళ కేకలూ, అన్నీ గజిబిజిగా అల్లకల్లోలంగా వినిపించి విసిగిస్తూన్నా, మధ్యలో 'కయ్' మంటూ గౌరి అరుస్తూన్న అరుపు, ఒకరకమైన వైవిధ్యంతో శైలజకి ఆసక్తిని కలిగిస్తోంది.

రెప్ప వెయ్యకుండా గౌరి చలాకీతనాన్నీ చురుకుతనాన్నీ చూస్తున్న శైలజ తన హుందాతనంతో కూడిన సౌమ్య ప్రకృతిని ఆమె హుషారుతో పోల్చుకుంది. ఆమెకేం ఉంది? తనలా చదువా, సంస్కారమా, ఉద్యోగమా, హోదాయా, సంపదా? ఏం లేవే! అయినా, ఎంత చైతన్యంగా ఉంది ఈ పిల్ల! ముఖంలో ఏం ఆత్మ విశ్వాసం, ఏం సంతృప్తి? అన్నీ ఉన్న తను అలా ఎందుకు ఉండలేదు? చిన్నప్పటినుంచీ తనది పిరికి మనసే. అవును గట్టిగా ఒకళ్ళని అనలేదు, ఒకళ్ళంటే పడలేదు.

చిన్నప్పుడు నాన్నగారంటే ఎంత హడలని! పోనీ అని ఆయన తనని ఎప్పుడూ గట్టిగా కేకలేసిందికూడా లేదు. అయినా తనకి భయమే! కాన్వెంటుకి కట్టవలసిన జీతం అడగాలన్నా, స్నేహితురాలితో అలా ఆడుకోడానికి వెళతానని చెప్పాలన్నా, కొత్త చెప్పులు కొనమని అడగాలన్నా, అన్నింటికీ భయమే!.... తలుపు వెనకాల నిలబడి నాలుగైదుసార్లు రిహార్సల్స్ వేసుకుని, నోరు తడి చేసుకుంటూ వణికిపోతున్న కంఠంతో నెమ్మదిగా అడిగేది. ఇంతా చేస్తే ఆయన "సరేలే అమ్మా! ఇదిగో, ఈ డబ్బు తీసుకో" అనేసేవారు. నాన్నగారు ఏం అనరని తెలుసు. అయినా ఏమిటో....

ఏదో బస్ వచ్చింది తీరాచూస్తే తను వెళ్ళేదికాదు. స్టేండ్ గుమస్తా చెప్పిన ప్రకారం అయిదున్నరకి రావాలి అది వాచీ చూసుకొంది శైలజ. ఇంకా పావుగంట టైముంది. పావుగంటా ఇలా బస్‌స్టాండ్‌లో నిలబడి ఉండాలి కాబోలు! కూచుందాం అంటే బెంచీల నిండా నలుగైదుగురు మగాళ్ళయితే ఏం పనిలేనట్లు నడుంవాల్చి కబుర్లు చెప్పుకుంటున్నారు.

''కొట్టనా అండీ!'' అని ఎవరో తనని ఉద్దేశించి అన్నట్లయి శైలజ ఉలిక్కిపడి అటు చూసింది. పదేళ్ళ కుర్ర వెధవ! జారిపోకుండా మొలతాడుతో పట్టి ఉంచిన పాత కాకీ నిక్కరూ, బొడ్డుపైదకిలాక్కుపోయిన చిరుగుల బనీనూ వాడూను. ''షోడాకొట్టమంటారా అమ్మగారూ?" అంటూ, ఇంకా తను వద్దని చెప్పేలోగానే కీచు మనిపించి సోడా తన చేతికి అందియ్యబోయాడు.

"నాకు వద్దు ... ఎవరుకొట్టమన్నారు?" శైలజ కొంచెం విసుగ్గా అంది.

''కొట్టేశాను కదాండీ....తీసుకోండి '' తీసుకోక తప్పదు అన్నట్టుంది వాడి మాట. ఏవిటి వీడి దబాయింపు! శైలజ కోపంగా కుర్రాడికేసి చూసింది.

"ఊ....'' అన్నాడు సోడా కుర్రాడు ఒకరకమైన ఆజ్ఞాపిస్తున్న స్వరంతో శైలజకి ఈ మారు కోపమే వచ్చింది.

"నాకు వద్దంటూంటే!''

''వద్దూ?... అయితే డబ్బులిచ్చెయ్యండి''-పదేళ్ళ కుర్రాడి కంఠంలోనూ బెదిరింపూ, తెగువతనం.... ఈ బస్‌స్టాండులో వీడితో లేనిపోని గొడవెందుకు? పదిమందీ జేరడం, అల్లరీను ...అనుకొని అయిష్టంగా పదిపైసలు తీసి వాడి చేతిలో పెట్టి ఒక గుక్కెడు సోడా తాగినట్టే తాగి వాడి కిచ్చేసింది శైలజ.

సన్నగా నాజూగ్గా, కాలీ నిల్కు చీరలోంచి పాతికేళ్ళ వయస్సు తాలూకు అందాలు స్పష్టాస్పష్టంగా కనిపిస్తూంటే "డబ్బున్న ఆవిడలాగవుంది. డబ్బున్న వాళ్ళు చదువుకుంటారు. ఇంకా డబ్బు సంపాదిస్తారు తనుకే కనక డబ్బుంటే తన అక్కకూడా ఇలాంటి బట్టలేసుకోపోయిందా? చదువుకోక పోయిందా?ప్చ్!" అని నిట్టూరుస్తూ ఆ కుర్రాడు డబ్బులూ సోడాసీసా తీసుకువెళ్తుంటే వాడెందుకు నిట్టూర్చాడో అర్థంకాలేదు శైలజకి. అయితే, వాడు తిన్నగా అరుస్తూ పువ్వు లమ్ముతున్న ఆ పిల్లదగ్గరికి వెళ్ళి పదిపైసల బిళ్ళ ఆమె చేతికిస్తూ దూరంగా నిల్చున్న తనని వేలితో చూపిస్తున్నప్పుడూ, ఇద్దరూ కలిసి తనను చూసి నవ్వు కున్నప్పుడూ ఏదో అర్థమయినట్లయి శైలజకి కొంచెం ఉడుకుమోతుతనం వచ్చింది. "డబాయించి తన దగ్గర డబ్బులు లాగానని వాడు చెబుతున్నట్లున్నాడు. వాడూ అదీ కలిసి తన అసమర్థతతకి చేతగానితనానికి నవ్వుకుంటున్నట్లున్నారు!"

శైలజకి ఒక్కక్షణం ఆ పువ్వులమ్మే పిల్లమీదా, సోడా కుర్రాడి మీదా భలే కోపం వచ్చింది. ముఖం మరోవైపుకి తిప్పేసుకుంది. కోపం వస్తే తను ముఖం తిప్పేసుకుంటుంది. అంతకంటే ఎదుట మనిషిని ఏం అనలేదు. పరుషంగా మాట్లాడాలన్నా చెడామడా నాలుగు అనాలన్నా తనకేమిటో ఇష్టం ఉండదు. ఎంత కోపం వస్తే అంతగా మూతిముడుచుకుని మౌనంగా ఉంటుంది. అఫ్‌కోర్స్- అది అర్థం అయినవాళ్ళకే అర్థం అవుతుంది, లేనివాళ్ళకి లేదు.

ఇంటర్‌మీడియట్‌లో తనకి లెఖ్ఖల్లో నూటికి నూరు మార్కులు వచ్చి ఇంజనీరింగ్ కాలేజీలో చేరడానికి వెళ్ళినప్పుడు, ప్రిన్సిపాల్ పగలబడి నవ్వి "ఏమిటమ్మా నువ్వు ఇంజనీరింగ్‌లో చేరావా? సర్వే సెట్టూ, ఇనుపగొలుసులూ మొయ్యాలి. వర్క్‌షాపులో సుత్తీ దాగరాతో పనిచెయ్యాలి. ఇంజనీరింగ్ అంటే గచ్చకాయలు ఆడుకోడం కాదు. పైగా ఫస్టియర్ నుంచి ఫైనలియర్ దాకా అంతా మొగపిల్లలు నువ్వు ఒక్కతైవేఉంటావు ఆడపిల్లవి. ఆలోచించుకో మరి ఎటు వంటి సమస్యలు వస్తాయో" అంటూ అవహేళన చేశాడు. తనకి కోపంతోనూ అవమానంతోనూ ముఖం అంతా కందగడ్డలా అయిపోయింది. ఆయన తనకి పౌరుషం వచ్చిందని గ్రహించాడు. కనకే "సరే నీ యిష్టం" అంటూ సీటు ఇచ్చాడు.

ఆయన అన్నట్లు అయిదేళ్ళూ తనకో అయిదు యుగాలుగా గడిచాయి. నిత్యమూ ఏదో ఒక సమస్య. ఎవరో ఒకరు తనని లోకువకట్టి ఏదో ఒక మాట

ఆనడమే. కాలేజీ స్టూడెంట్స్‌లో సగం కళ్ళు తనమీదే!.... ప్రతివాడూ ఏదో ఒక వంకని తనని పలకరించడమే!

"వాసుగాడు వట్టిపోజుగాడండి! వాడి మాటలు నమ్మేరు కనక!" అంటూ ఓ రాముగాడొచ్చి వార్నింగ్ ఇచ్చి వెళ్తే—

"ఏమండోయ్, ఆ రాముగాడితో తరుచు మాట్లాడకండి. వాడంత అబద్ధాలకోరు ఈ కేంపస్‌లో లేడు" అంటూ మరో సోముగాడు వచ్చి హెచ్చరిక చేసేవాడు.

"సర్వే కేంపుల్లో అందమైన చీరతో కులుకుతూ పైట సర్దుకుంటూ గాజులు గల గల మనిపిస్తే డిగ్రీ రాదు. ఈ ఇనప గొలుసు మొయ్యాలి. సర్వే కేంపుల్లో ఇనపగొలుసు ఒక్కసారైనా మొయ్యనివాళ్ళకి మహాపాపం రావడం కాదు, ఇంజనీరింగ్ డిగ్రీ కూడా అర్నెల్లు ఆలస్యంగా వస్తుంది, ఇంటర్వ్యూలో అడుగుతారు సర్వే కేంప్‌లో ఇనపగొలుసు మోశావా అని 'లేదు' అన్నవాళ్ళకి ఉద్యోగం గోవిందా?'' అని ఒకడు అన్యాపదేశంగా తనకి ఉక్రోషం కలిగిస్తే;

''మీ అందాల చేతులు కందేను పాపం, ఎందుకు ఈ బెడద?'' అంటూ తనకి రోషం వచ్చేలాగ తన చేతిలో గొలుసుని సున్నితంగా మరొహడు తీసు కునేవాడు.

''ఈ జీవిత కుసుమం నీ పాదాల కంకితం'' అంటూ ఒకడు కవిత్వంలో ఏడిస్తే, ''ఇవి పువ్వులు కాదు- నా ప్రాణా''లంటూ మరొకడు ఇన్ని బొగడ పువ్వులో జాజిపువ్వులో తెచ్చి ముంగిట్లో పోసి పోయేవాడు.

''విరిబోణీ! విప్పచెట్టు దగ్గర కలుసుకో'' అని ఒక విరహార్తుడి కబురూ, ''నువ్వు పెళ్ళికి ఒప్పుకోకపోతే నా ప్రాణాలు తీసుకుంటా'' అని ఒక పిచ్చివాడి లేఖా!

అమ్మమ్మ!....ఆ అయిదేళ్లూ అయిదు మహాయుగాలయిపోయాయి. తనకి కోపం, అసహ్యం, ఆవేశం ఒక్కుమ్మడిగా వచ్చేవి. ఆడదంటే మగాడికింత ఆలుసెందుకు?.... మహిళాభ్యుదయం అంటూ మళ్ళీ అరుస్తారే! తమతో సమంగా ఉండే స్త్రీపట్ల వీళ్ళ చూపులు మారవేం? వీళ్ళ ఆలోచనల్లో మార్పు రాదేం? అని తను తెగ బాధపడేది ఈ మాటలే మొహంమీద అడగాలని ఎన్ని మార్లో అనుకుంది. కాని, అలా అపరకాళిలా కేకలేసి అల్లరిచేస్తే మర్యాదగా ఉండదేమో అని ఎప్పటికప్పుడే తమాయించుకొని ఊరుకొంది.

శైలజ ఇలా ఆలోచిస్తూనే వుంది.

'గయ్' మంటూ గౌరి కంఠం బిగ్గరగా వినిపించింది.

''ఏంటిరా సచ్చినాడా! ఏంటి కూశావ్? మళ్ళీకుయ్! నాను నీ కంటికి సినిమా టారులా ఉన్నానా? పిచ్చిపిచ్చి వాగుడు వాగేవో నాలిక సీల్చేత్తా, జేగర్త!'' అంటూ చేతులు జాపుకుంటూ పక్కనే వున్న పళ్ళకొట్టువాడి మీద మీదకి వెళు తోంది. పక్క పక్కనున్నవాళ్ళు ''ఊరుకో గౌరీ, ఊరుకో'' అంటూ ఆమెని ఆపుతున్నారు ఇందాకటి సోడా కుర్రాడు ''ఏంటే అక్కయ్యా, ఏంటన్నాడు అడు'' అంటూ చేత్తో సోడాబుడ్డి పుచ్చుకుని దాన్ని పైకి యెత్తాడు.

పక్కనున్న పళ్ళకొట్టువాడు బిక్కచచ్చిపోయి ''నేనేంటన్నాను? నేనేంటన్నాను?'' అంటూ తనలో తను గొణుక్కుంటూ వెనక్కి వెనక్కి తగ్గు తున్నాడు బాగా అయిదారడుగుల మనిషే! బలంగా కండలు తిరిగి, కోరమీసం మెలితిరిగి, మనిషిలోని పాతిక ముప్పై ఏళ్ళ యౌవనాన్ని సూచిస్తున్నాయి. తిరగబడితే సునాయాసంగా నలుగురైదుగుర్ని తన్నగలడు. అయితేనేం, తప్పు చేసినవాడిలా సిగ్గుపడిపోతూ, అవమానంతో కుంగిపోతూ వెనక్కి వెనక్కి నడుస్తున్నాడు.

ఆ స్థితిలో పళ్ళకొట్టువాడిని చూసేసరికి శైలజకి జాలేసింది. పాపం, వాడి స్థితి ఎంత దయనీయంగా తయారైంది! ఈ పువ్వులమ్మాయి మరీను. వాడి పరువు బజార్న పెడుతోంది. ఏదో కొంటెమాట అన్నాడే అనుకో. దానికింత హంగామా చెయ్యాలా?

ఇలా శైలజ అనుకోవడమే కాదు. తగువు తీర్చడానికి వచ్చిన వాళ్ళల్లో ఒకళ్ళిద్దరు కూడా అమాటే అన్నారు. ''పోనియ్యి గౌరీ! ఏదో తెలివితక్కువ మాట అన్నాడే అనుకో. అన్నదానికి సిగ్గుపడుతున్నాడు కదా - ఇంక వాడివి వదిలెయ్యి'' అని. గౌరి మాత్రం ఊరుకోకుండా ''ఇలాంటోళ్ళని ఊరుకో కూడదయ్యా! ఊరుకుంటే లోకువకట్టి మరింత అలుసు సేస్తారు. పొద్దుగూకులా ఇక్కడుండవలసినదాన్ని. అలుసైతే ఇక బ్రతికినట్టే!'' అంటూ గట్టిగా అరిచింది.

గౌరి అన్న ఆ మాటలు విని శైలజ ఉలిక్కిపడింది. నిజమే తన పరిస్థితి నిజానికి అలాగే ఉంది. నెల్లాళ్ళక్రితం సరదా పడి, వచ్చిన ఉద్యోగం వదులుకోవడం ఎందుకని ఈ ఊళ్ళో కొత్తగా తెరిచిన ఇంజనీరింగ్ ఆఫీసులో

సూపర్‌వైజరుగా చేరింది. చేరింది లగాయతు తోటి సూపర్‌వైజర్ల దగ్గర్నుంచి డివిజనల్ ఇంజనీర్ వరకూ అందరి కళ్లూ తనమీదే. వాళ్ళంతా తనని అదోలా చూట్టమే! కొందరు అవసరం ఉన్నా లేకపోయినా, పని కల్పించుకొని తనతో కబుర్లు చెప్తున్నారు అర్థంలేని చనువు తీసుకొని మరో అర్థం వచ్చేలా మాటలు వదుల్తూ కొంటె నవ్వులు నవ్వుతున్నారు కొందరు. అన్యాపదేశంగా కొందరు అవహేళన చేస్తుంటే ఆత్మబంధువుల్లా నటిస్తూ మరికొందరు అనవసరపు జాలి ప్రకటిస్తున్నారు. తనకి చికాకు, కోపం, తన నిస్సహాయస్థితిమీద తనకే విసుగూ రాసాగాయి. ఒక్కళ్ళేనా తన జోలికి రాకుండా తన గొడవ పట్టించుకోకుండా ఉంటారనుకుంది. ఉహూ! ఆఖరికి డివిజనల్ ఇంజనీరు ప్రవర్తన కూడా రాను రాను చిత్రంగా మారిపోసాగింది.

''ఒక్కసారైనా కూర్చుంటే ఏంతోస్తుంది? అప్పుడప్పుడూ మా యింటికి వస్తూ ఉండు" అన్నాడు.

''అర్జంటు కాగితాలున్నాయి. ఇవాళ ఇంకో గంట నువ్వు ఆఫీసులో ఉండాలి'' అన్నాడు మరో రోజున.

మొన్నటికి మొన్న రూమ్‌లోకి సంతకాలకని కాగితాలు పట్టుకెళ్ళిన తనని 'కూర్చో కూర్చో' అంటూ బలవంతంగా కుర్చీలో కూర్చోబెట్టి కాఫీ తెప్పించి తన అందాన్ని పనిమాలా పొగడడం మొదలెట్టాడు. తనకి సర్వఅసహ్యం వేసింది. కాని, ఆ అసహ్యాన్ని మనసులోనే అణుచుకుంది. తనకి ఉద్యోగం ఇబ్బందిగా ఉందనీ, రాజీనామా చేసి వచ్చేస్తున్నాననీ అక్కయ్యకి ఉత్తరం రాస్తే, ఇంత పొడుగు జవాబు రాసింది అక్కయ్య - ''తొందర పడొద్దనీ. ఈ రోజుల్లో ఉద్యోగాలు రావడం కష్టంగా ఉన్నాయనీ, అంతగా అయితే ఓ వారం రోజులు శలవు పెట్టి రమ్మనీ, అవసరం అయితే మరోచోటికి ట్రాన్స్‌ఫర్ చేయించుకుందా''మనీను.

తనకి వళ్ళు మండుకొచ్చింది ఆ సలహాలు చూసేసరికి. ఇంకో ఊరు ట్రాన్స్‌ఫర్ అయితే మాత్రం ఆక్కడా ఇలాంటి మనుషులు ఉండరని నమ్మకం ఏముంది? ఏమిటో....తనకేం తోచటం లేదు. బుర్రంతా చీకాగ్గా ఉంది. ముందు ఓ వారం సెలవు పెట్టి ఆ తర్వాత రాజీనామా కాగితం పంపిద్దాం అని నిశ్చయించుకుని, తన ఊరు వెళ్ళడానికి సిద్ధమయ్యే, ఇప్పుడిల్లా బస్‌స్టాండుకి వచ్చింది. ఇంకో అయిదు నిమిషాల్లో బస్ వస్తుంది.

శైలజ దృష్టిఅంతా దూరంగా కూర్చున్న గౌరిమీదే ఉంది. నిజానికి తనలాంటి సమస్యే ఆ అమ్మాయిదీను? తన కాలేజీ క్లాస్‌మేట్స్‌కి, ఇప్పుడు ఆఫీసులో కొలీగ్స్‌కి. ఆ కొట్టు అబ్బాయికీ తేడా ఏం ఉంది? వీళ్ళంతా తోటి ఆడ వాళ్ళని కళ్ళతో నంజుకొనే అనాగరకులే. మాటలతోనూ చేతలతోనూ హింసించాలని చూసే కరకు హృదయులే ఇలాంటి వాతావరణం మధ్య ఆడదాని బ్రతుకు క్షణం క్షణం దుర్భరమే

కాని - ఈ వాతావరణాన్ని ఎదుర్కొని ధైర్యంగా ధీమాగా కూర్చుంది ఈ అమ్మాయి.

మరి తనో?....అంతే- ఆ ఆలోచనతో శైలజ హఠాత్తుగా ఒక నిర్ణయానికి వచ్చి, బస్‌కి వెళ్ళకుండా వెనక్కి రూమ్‌కి వెళ్ళిపోయింది - మర్నాడు శెలవు కేన్సిల్ చేసుకుని ఆఫీసులో చేరి, కొత్త పద్ధతిలో సమస్యల్నీ, జీవితాన్నీ, ఎదుర్కోవాలనే నిశ్చయంతో. *

(స్వాతి-'71)